నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, ఆదివారం 20 అక్టోబర్ 2024 | MAHABUBNAGAR NARAYANPET

# కాంగ్రెస్ నేతల మాటలు సిగ్గుచేటు

వనపర్తి, అక్టోబర్ 19 (నమస్తే తెలంగాణ) : వానకాలం పంట చేతికందే సమయ మొచ్చినా రైతు భరోసా ఇవ్వకుండా.. చివరికి ఇచ్చేది లేదంటూ దాట వేయడం సిగ్గుచేటని నేతలు మండిపడ్డారు. రైతులకు సీఎం రేవంత్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ శనివారం బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, మీడియా కన్వీనర్ అశోక్ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరంగల్ డిక్లరేషన్ అంటూ రైతులకు రాహుల్‌గాంధీ సాక్షిగా డిసెంబర్ 9నాటికి రూ.30వేల కోట్ల రుణమాఫీ చేస్తామని ప్రకటించారని.. కానీ, నేడు నిబంధనల పేరుతో సగానికి పైగా రైతులకు మొండిచేయి చూపించారన్నారు. అలాగే రైతు భరోసా కింద రెండు పంటలకు రూ.15 వేలు అందిస్తామని వాగ్దానం చేశారన్నారు. వానకాలం పంటలు చేతికొచ్చే దశలో ఇక భరోసా పథకం ఇవ్వలేనని సాక్షాత్తు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల చెప్పడం రైతులను నట్టేట ముంచడమేనని దుయ్యబట్టారు. కౌలు రైతులు, రైతు కూలీలకు రైతు భరోసా ఇస్తామని గద్దెనెక్కిన కాంగ్రెస్ రెండు విడుతలు ఇవ్వకుండా మొత్తానికే ఎత్తేసిందన్నారు. హామీలను అమలు చేసే వరకు వదిలేది లేదని స్పష్టం చేశారు. నిరు ద్యోగ భృతి ఇచ్చి జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని గొప్పలు చెప్పి నిరుద్యోగులపై లాఠీచార్జ్ చేయడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో నాయకులు విజయ్‌కుమార్, నాగన్నయాదవ్, తిరుమల్, జాత్రునాయక్, నర్సింహ, జోహెబ్ హుస్సేన్, తిరుపతయ్య, సత్యం, మహేశ్వర్‌రెడ్డి, జమీల్, శాంతన్న, శ్రీనివాసులు, గిరి, రాము, హేమంత్, వహీద్, బాలకృష్ణ ఉన్నారు.

రైతు భరోసా ఇవ్వలేమన్న వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాటలకు నిరసనగా వనపర్తి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

# భగ్గుమన్న బీఆర్ఎస్

- కర్షకులంటే కాంగ్రెస్‌కు ఎందుకు కడుపుమంట
- సీఎం రేవంత్ వెంటనే క్షమాపణ చెప్పాలి
- బీఆర్ఎస్ నేతలు, రైతన్నల డిమాండ్
- మంత్రి తుమ్మల వ్యాఖ్యలకు నిరసనగా ప్రభుత్వ దిష్టి బొమ్మ దహనం

***దేశానికి అన్నం పెట్టే రైతులపై కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా శనివారం ఉమ్మడి జిల్లా బీఆర్ఎస్ నేతలు భగ్గుమన్నారు. కేసీఆర్ సర్కారు రెండుపంటలకు రూ.10వేలు పెట్టుబడి సాయం అందించగా, అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రేవంత్‌రెడ్డి రూ.15వేలు ఇస్తామని ప్రగల్భాలు పలికారు. తీరా యాసంగిలో ఇవ్వకపోగా, కనీసం వానకాలమైనా ఇస్తారనుకున్న రైతన్నల ఆశలపై నీళ్లు చల్లుతూ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు రైతుభరోసా ఇవ్వలేమంటూ చేతులెత్తేయడంపై అన్నదాతలు, గులాబీ పార్టీ నేతలు మండిపడ్డారు. నిరసనలు తెలిపి ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆందోళన చేస్తున్న నేతలను పోలీసులు అరెస్టులు చేశారు.*** *- నమస్తే నెట్‌వర్క్, అక్టోబర్ 19*

మూసాపేటలో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు, కొత్తకోట మండల కేంద్రంలో దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నేతలు

## గ్రామాల్లోకి రానివ్వొద్దు

మూసాపేట, అక్టోబర్ 19 : రైతులను నట్టేట ముంచిన కాంగ్రెస్ నేతలను గ్రామాల్లోకి రాని వ్వొద్దని, ఎక్కడికక్కడ నిలదీయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లక్ష్మీ నర్సింహ యాదవ్ అన్నారు. రైతు భరోసా ఇవ్వలేమని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రకటించడాన్ని నిరసిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా శనివారం మూసాపేట జాతీయ రహదారి వేములస్టేజీ వద్ద బీఆర్ఎస్ నాయకులు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా లక్ష్మీనర్సింహ మాట్లాడుతూ హామీ ప్రకారం సీఎం రేవంత్‌రెడ్డి రైతుభరోసా ఇవ్వాల్సిందేనన్నారు. దిష్టిబొమ్మ దహనం చేయకుండా.., నిరసన వ్యక్తం చేసే అవకాశం కూడా ఇవ్వకుండా బీఆర్ఎస్ పార్టీ నాయకులను అడ్డుకోవడమేమిటని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తుందని, ప్రతి ఒక్కరూ ప్రభుత్వ కార్యక్రమాలను గమనిస్తూనే ఉన్నారన్నారు. ఆరు గ్యారెంటీల పేరిట అందరినీ మోసం చేస్తున్నదని మండిపడ్డారు. అనంతరం బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసేందుకు తీసుకొస్తుండగా.. ఎస్సై శ్రీనివాసులు సిబ్బందితో అడ్డుకొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు చంద్రశేఖర్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

మూసాపేటలో బీఆర్ఎస్ నాయకులు దహనం కోసం తీసుకొచ్చిన దిష్టిబొమ్మను తీసుకెళ్తున్న కానిస్టేబుల్

భూత్పూర్ మున్సిపల్ చైర్మన్‌ను బలవంతంగా లాక్కెళ్తున్న పోలీసులు

## రైతులను ముంచుతున్న సర్కారు

- భూత్పూర్ మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్‌గౌడ్

భూత్పూర్, అక్టోబర్ 19 : రైతులను ముంచేలా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తుందని మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్ అన్నారు. వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ పంటకు రైతు భరోసా ఇవ్వమని తేల్చిచెప్పడంతో శనివారం భూత్పూర్‌లో రైతులతో భారీ ర్యాలీ నిర్వహించి, రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా బస్వరాజ్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ అంటేనే కరువుకు నిదర్శనమని, ఏనాడూ రైతులను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి పదేండ్లలో వ్యవసాయరంగాన్ని పండుగలా మార్చగా, కాంగ్రెస్ వచ్చిందే తడవుగా రైతుల కండ్లల్లో కన్నీళ్లు తెప్పిస్తున్నారన్నారు. ఆరు గ్యారెంటీలంటూ ప్రజలను బురిడీ కొట్టించి అధికారంలోకి వచ్చి పరిపాలన చేతగాక మూసీనది అంటూ కొత్తరాగం ఎత్తుకున్నారన్నారు. 90 శాతం పనులు పూర్తయిన ప్రాజెక్టులను వదిలేసి మూసీ ప్రక్షాళన అంటూ కాంట్రాక్టర్లకు దోచి పెట్టేందుకు సిద్ధమయ్యారని ఆరోపించారు. రైతులను విస్మరిస్తే పుట్టగతులు లేకుండా పోతారని హెచ్చరించారు. అనంతరం సీఎం దిష్టి బొమ్మ దహనం చేసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. శాంతి యుతంగా రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ అశోక్‌రెడ్డి, ఫ్లోర్‌లీడర్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రశేఖర్‌గౌడ్, మాజీ సర్పంచులు నారాయణ, సత్యనారాయణ, వెంకటయ్య, ఆంజనేయులు, నాయకులు యాదిరెడ్డి, రామునాయక్, రాములు, సురేశ్‌గౌడ్, నర్సింహారెడ్డి, శంకర్‌నాయక్, ప్రేమ్‌కుమార్, షాకీర్, తిరుపతయ్య, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

గద్వాల కలెక్టరేట్ ఎదుట ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

## అన్యాయం చేస్తే సహించం

గద్వాల, అక్టోబర్ 19 : వానకాలం సీజన్‌కు సంబంధించి రైతులకు రైతు భరోసా రూ.15వేలు చెల్లించాల్సిందేనని మాజీ జెడ్పీటీసీ బాసు శ్యామల ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వానకాలం సీజన్‌కు రైతు భరోసా పోయిన ట్లేనని మంత్రి తుమ్మల చేసిన వాఖ్యలను నిరసిస్తూ కలెక్టరేట్ ఎదుట శనివారం రాష్ట్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ గెలిస్తే రైతు బంధుకు రాంరాం అని అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పిన మాటలను అక్షరాలా రేవంత్‌రెడ్డి నిజం చేస్తున్నారని అన్నారు. రైతుబంధు ఎగ్గొట్టేసి లక్షలాది మంది అన్నదాతలకు మొండి చేయి చూపించిందన్నారు. వెంటనే రైతుభరోసా కింద ఎకరాకు రూ.15వేలు ఇవ్వాలని, లేదంటే పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మోనేశ్, శ్రీరాములు, పరశురాముడు, మాజు, ముని, మౌర్య, రాజు, గంగాధర్, తిమ్మప్పగౌడ్, భాస్కర్, నర్సింహులు, కామేశ్, సోను, ఫరాజ్ తదితరులు పాల్గొన్నారు.



న్యాక్ కమిటీకి పరిశోధనాలయం పనుల వివరాలు నివేదిస్తున్న ఇంజినీరింగ్, పీయూ అధికారులు

## పీయూలో న్యాక్ బృందం పర్యటన

- పరిశోధనాలయం పనుల నాణ్యత పరిశీలన

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబర్ 19 : పాలమూరు యూనివర్సిటీలో రూ.10 కోట్లతో 2022లో ప్రారంభించిన భవన నిర్మాణ పనుల పురోగతి, నాణ్యతను న్యాక్ కమిటీ అధికారుల బృందం శనివారం పరిశీలించింది. ఈ సందర్భంగా భవన నిర్మాణం, చేపట్టిన పనులు తదితర అంశాలను గురించి న్యాక్ కమిటీ ఈఈ రాంచందర్‌కు పీయూ టెక్నికల్ కన్సల్టెంట్ ఇంజినీర్ శ్రీనివాస్, ఈఈ రమేశ్, డిప్యూటీ ఈఈ రాము, ఏఈ ఎక్బాల్ వివరించారు. ఈ సందర్భంగా పీయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. పాలమూరు విశ్వవిద్యాలయం పరిశోధనలకు అడ్డాగా మారనున్నదన్నారు. విద్యార్థులకు అధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పనిచేసే పరికరాలు త్వరలోనే అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. నూతన ఆవిష్కరణల కోసం పరిశోధనలు చేపట్టేందుకు రూసా, విశ్వవిద్యాలయం నిధులు రూ.10కోట్లతో సీఆర్ఎఫ్‌బీ (సెంట్రల్ రీసెర్చ్ ఫెసిలిటీ బిల్డింగ్) ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పీయూ పరిధిలో అన్ని రకాల కోర్సుల విద్యార్థులు, పీహెచ్‌డీ స్కాలర్లను పరిశోధనల దిశగా ప్రోత్సహించే లక్ష్యంతో అన్నిరకాల పరిశోధనలకు అవసరమైన సామగ్రిని అందుబాటులోకి తీసుకురానున్నామన్నారు. కార్యక్రమంలో పీయూ అసిస్టెంట్ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# భళా.. బైరి సురేశ్

- నాడు చెప్పులు కుట్టిన చేతికి నేడు డాక్టరేట్
- యువతకు స్ఫూర్తిగా నిలిచిన పీయూ అధ్యాపకుడు
- అభినందించిన ఇన్‌చార్జి రిజిస్ట్రార్, అధ్యాపకులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబర్ 19 : నిత్యం రెక్కాడితేనే డొక్కాడని కుటుంబం. అయినా ఉన్నత లక్ష్యాలు రాణించాలనే తపనతో ఓ వైపు చెప్పులు కుడుతూ మరో వైపు విద్యనభ్యసిస్తూ.. ఉన్నతంగా ఎదిగి.. వర్సిటీ అధ్యాపకుడిగా డాక్టరేట్ సాధించి యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు పాలమూరు యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల అధ్యాపకుడు బైరి సురేశ్. ఆయనకు శనివారం ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ బహూకరించిన సందర్భంగా పీయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ నూర్జహాన్, విభాగాధిపతి ప్రభాకర్‌రెడ్డి, పీఆర్వో రవికుమార్, పీయూ అధ్యాపకులు, బోధన, బోధనేతర సంఘం నాయకులు సత్కరించి అభినందించారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం కల్లడికి చెందిన బాలయ్య, కళావతి దంపతుల మొదటి సంతానం బైరి సురేశ్. ఈయన ప్రాథమిక విద్యాభ్యాసం అంతా కల్లడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోనే కొనసాగింది. ఇంటర్మీడియెట్ సోషల్‌వెల్ఫేర్ గురుకుల విద్యాలయం, బీఫార్మసీ వరంగల్‌లోని కాకతీయ యూనివర్సిటీలో, ఎంఫార్మసీ పంజాబ్‌లోని నైపర్ మొహాలీలో పూర్తిచేశారు. ఉస్మానియా యూనివర్సిటీలో గైడ్ టీచర్ ఎంఎ తాహిర్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అలగర్‌స్వామి, సహాయ పర్యవేక్షకులుగా పూర్వ ప్రిన్సిపాల్, డీన్ ప్రొఫెసర్ శ్యాంసుందర్ క్యాన్సర్ మహమ్మారి నియంత్రణలో భాగంగా 'న్యూ హెటీరో సైక్లిక్ హైబ్రిడ్స్ డిజైన్ సింథసిస్' అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ వరించింది. ప్రస్తుతం ఈయన ఫార్మసీ కళాశాల ఒప్పంద అధ్యాపకుడిగా, పరీక్షల నిర్వహణ విభాగం ప్రొఫెషనల్ కోర్సుల కోఆర్డినేటర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈయన చేసిన పలు పరిశోధన పత్రాలు జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. పలు సదస్సుల్లో పత్రసమర్పణ చేశారు.



సురేశ్‌ను అభినందిస్తున్న ఇన్‌చార్జి రిజిస్ట్రార్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్

### చెప్పులు కుడుతూ చదువుకున్నా..

మాది పేద కుటుంబం. పాఠశాలకు వెళ్లివచ్చాక రోడ్డుపై చెప్పులు కుట్టేవాడిని. కళాశాల స్థాయిలోనూ గురుకులంలో, ఎం ఫార్మసీ, బీ-ఫార్మసీ చదివే సమయాల్లోనూ ఇంటికి వచ్చిన సందర్భంలోనూ ఇంటికి పెద్దవాడిగా బాధ్యతలు నిర్వర్తిస్తూ చెప్పులు కుట్టే వృత్తి ద్వారానే కుటుంబానికి ఆర్థిక తోడ్పాటును అందించా. 2012లో పీయూలో అధ్యాపకుడిగా జాయిన్ అయ్యాను. ఇప్పుడు డాక్టరేట్ సాధించడం సంతోషంగా ఉంది. మా ఊరిలో పీహెచ్‌డీ డాక్టరేట్ సాధించిన ఏకైక వ్యక్తిని నేనే. మరో పదిమందికి సైతం ఉన్నత విద్యనభ్యసించేలా చేస్తా. సత్ఫలితాలను సాధిస్తా.

*- బైరి సురేశ్, పీయూ ఫార్మసీ కళాశాల అధ్యాపకుడు*

## పీయూ వీసీగా శ్రీనివాస్ బాధ్యతలు

అహ్మద్‌నదీంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జీఎన్.శ్రీనివాస్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబర్ 19 : పీయూ వైస్ చాన్సలర్‌గా ప్రొఫెసర్ శ్రీనివాస్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇన్‌చార్జి వీసీగా కొనసాగుతున్న సీనియర్ ఐఏఎస్ అధికారి, ప్రణాళికా సంఘం రాష్ట్ర ముఖ్య కార్యదర్శి అహ్మద్‌నదీంను హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. సోమవారం పాలమూరుకు రానున్నారు.

***పట్నం నుంచే పాలన కొనసాగిస్తారా..?***

గతంలో పనిచేసిన వీసీ ప్రొఫెసర్ లక్ష్మీకాంత్‌రాథోడ్ పీయూలోని గెస్ట్ హౌజ్‌లోనే ఉండి విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది బాగోగులు చూసుకోవడంతోపాటు విద్యాభివృద్ధికి విశేష కృషి చేశారు. ఆయన హయాంలో పీయూకు రూ.వంద కోట్ల నిధులు రావడం తోపాటు రూసా, ఇతర ప్రాజెక్టుల ద్వారా భారీ స్థాయిలో నిధుల సమీకరణ జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు రాకపోయినా.. వేతనాలు, పరిపాలనపరమైన అంశాల్లో ఆర్థిక ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు చేపట్టారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన వీసీ కరీంనగర్ జిల్లా కావడం, ఇన్నాళ్లు హైదరాబాద్‌లోనే ఉండడంతో పాలమూరులో ఉంటారా..? పట్నం నుంచే పాలన కొనసాగిస్తారా..? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

ఉన్నత విద్యకు పెద్దదిక్కుగా ఉన్న పీయూ వైస్‌చాన్సలర్ సీటు కోసం 159 దరఖాస్తులు అందాయి. ఇందులో రిజిస్ట్రార్లు, వైస్ చాన్సలర్లుగా పనిచేసిన అనుభవం గల వారు ఉన్నా.. హైదరాబాద్ జేఎన్‌టీయూలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగంలో సీనియర్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న శ్రీనివాస్ వైపు రాష్ట్ర ప్రభుత్వం, గవర్నర్ మొగ్గు చూపారు. పీయూలో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటుతోపాటు సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లోని కోస్గి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఇంజినీరింగ్ కాలేజీగా మారనున్నది. మహబూబ్‌నగర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ప్రభుత్వ ఐటీఐలను ఏటీసీలుగా మార్పు చేస్తున్న నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు విద్యా వేత్తలు పేర్కొంటున్నారు.

కోడేరు : నాగులపల్లి శివారులో నేలకొరిగిన వరి పంటను పైకి కడుతున్న రైతులు, కొల్లాపూర్ : వర్షాల ధాటికి నష్టపోయిన వరి పంటను చూపుతున్న రైతులు, నాయకులు

# నేలకొరిగిన వరి

కొల్లాపూర్/కోడేరు, అక్టోబర్ 19 : కొన్ని రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు వరి పంటలు దెబ్బతిన్నాయి. వర్షపు నీరు మడుల్లో చేరుకొని పంట ఒరిగిపోతున్నది. దీంతో చేతికి వచ్చిన వరి నీటిపాలు కావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నేల కొరిగిన వరిపైర్లను కొన్ని కొన్నిగా దారంతో కట్టే ప్రయత్నం చేస్తున్నారు. కొల్లాపూర్ మండలంలో వరి 120, మినుము పంట 69 ఎకరాల్లో నష్టం వాటిల్లినట్లు అధికారుల అంచనా. నష్టపోయిన రైతులను ఆదుకోవాలని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్ డిమాండ్ చేశారు. కోడేరు మండలంలోని కోడేరు, నాగులపల్లి, ఎత్తం, ముత్తిరెడ్డిపల్లి, జనుంపల్లి, తీగలపల్లి, బావాయిపల్లి, పస్పుల తదితర గ్రామాల్లో వరిపంటలు నేలకొరిగాయి.

***చేపల వేటకు వెళ్లి వాగులో పడిన బాలుడు***
***తృటిలో తప్పిన ప్రమాదం***

కొల్లాపూర్ మండలం నార్లాపూర్, ముక్కిడిగుడం గ్రామాల మధ్య ప్రవహిస్తున్న పెద్దవాగు ఒక్కసారిగా ఉప్పొంగడంతో చేపల వేటకు వెళ్లిన పదమూడేండ్ల బాలుడు నీటి ఉధృతికి వాగులో పడిపోయాడు. అక్కడే ఉన్న జాలర్లు వెంటనే తేరుకొని చేపల వల బాలుడికి అందించడంతో పెను ప్రమాదం తప్పింది. లచ్చనాయక్‌తండాకు చెందిన గోపాల్‌నాయక్ కుమారుడు శివ ఇంట్లో దోమతెర తీసుకొని పెద్దవాగు వద్ద చేపల వేటకు వెళ్లాడు. అకస్మాత్తుగా పెద్దవాగు ఉప్పొంగడంతో నీటి ఉధృతికి ప్రవాహంలో పడిపోయాడు. అక్కడే ఉన్న జాలర్లు చేపల వల విసరడంతో బతికి బయటపడ్డాడు. కాగా, పెద్దవాగుపై వంతెన నిర్మాణం చేపట్టాలని ఏన్నో ఏండ్లుగా డిమాండ్ చేస్తున్నా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

కొట్టుకుపోతున్న బాలుడిని కాపాడుతున్న జాలర్లు

## నల్లమలలో అదృశ్యమై.. వంగూరులో ప్రత్యక్షం

ఈదయ్యను విచారిస్తున్న ఎస్సై మహేందర్

వంగూరు, అక్టోబర్ 19 : అమ్రాబాద్ మండలం మన్ననూర్ నల్లమల అటవీ ప్రాంతంలో ఈనెల 14వ తేదీన అదృశ్యమైన నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం శేర్‌పల్లికి చెందిన ఈదయ్య శనివారం వంగూరు మండలంలోని ఓ పెట్రోల్ బంక్ సమీపంలో ప్రత్యక్షమయ్యాడు. వంగూరులోని పెట్రోల్ బంక్ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో ఎస్సై మహేందర్ సిబ్బందితో విచారించి యాదయ్యను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాగా, యాదయ్య చొక్కా చిరగడం తోపాటు చిన్నపాటి గాయాలు ఉన్నట్లు తెలిపారు. మతిస్థిమితం కోల్పోయాడన్నారు. వంగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స నిర్వహించి అమ్రాబాద్ పోలీసులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

## క్షణికావేశానికి చిన్నారి బలి

నారాయణపేట, అక్టోబర్ 19 : భార్యాభర్తల మధ్య ఏర్పడిన గొడవలో మూడు నెలల చిన్నారి ప్రాణాలు కోల్పోయిన ఘటన శనివారం నారాయణపేట లోని చిన్నపిల్లల దవాఖాన ఎదుట చోటుచేసుకున్నది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. నారాయణపేట మండలం లక్ష్మీపూర్‌కు చెందిన లక్ష్మి, భర్త కురుమూర్తికి మూడో సంతానంగా మగపిల్లాడు పుట్టాడు. శనివారం బాలుడితో నారాయణపేట చిల్డ్రన్ దవాఖాన వద్దకు వచ్చారు. ఇంతలోనే భార్యాభర్తలు గొడవపడి మూడు నెలల బాబును కింద పడేయగా అక్కడికక్కడే మృతిచెందాడు.